సాక్షి
కృష్ణాజిల్లా
గురువారం । 21 । నవంబర్ । 2024



ఆలయానికి విరాళం

వత్సవాయి: గ్రామంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు దగ్గుపాటి గోపిశ్రీకాంత్, లక్ష్మీ భవాని రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



ఐటీడీపీపై ఫిర్యాదు

గుణదల: టీడీపీ నేతలు ఐటీడీపీని అడ్డుపెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్నారని బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు అవినాష్, విష్ణు, ఆసిఫ్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆధ్యాత్మిక వైభవం

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి విజయయాత్ర బుధవారం ముగిసింది. నగరంలో ప్రత్యేక పూజలు చేసి ఆధ్యాత్మిక వైభవం చాటారు.



న్యూస్‌రీల్

పీహెచ్‌సీల నిర్వహణపై శ్రద్ధ చూపండి

వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ వాకాటి కరుణ



చిలకలపూడి(మచిలీపట్నం): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై శ్రద్ధ వహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ వాకాటి కరుణ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం జెడ్పీ సమావేశ హాలులో కలెక్టర్ బాలాజీతో కలిసి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇమ్యునైజేషన్ నూరుశాతం జరుగుతోందని, హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం గర్భిణులు ఎనిమియా రీడింగ్స్ కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే పటిష్టంగా చేయాలన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కొత్త పీహెచ్‌సీ భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. తొలుత జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు క్లస్టర్ల వారీగా సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు, పరీక్షలు ఆమె పరిశీలించారు. సమావేశంలో రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ గణపతి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీబిల్డింగ్ జట్టుకు ఎంపికలు

పెనమలూరు: బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనటానికి క్రీడాకారులను ఎంపిక చేస్తామని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించి ఈ నెల 24వ తేదీన కానూరు అశోక్ జిమ్‌లో జరగనున్న జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 86867 71358 ఫోన్‌లో సంప్రదించాలని అన్నారు. సంఘ అధ్యక్షుడు బత్తుల మనోహర్, గోల్డ్ ఫిట్‌నెస్ రాజు పాల్గొన్నారు.

ముగిసిన పోలీస్ స్పోర్ట్స్‌మీట్

ఓవరాల్ విన్నర్‌గా ఏఆర్ టీం



కోనేరుసెంటర్: జిల్లా పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న పోలీస్ స్పోర్ట్స్‌మీట్-2024 పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలకు ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్‌కుమార్ బహుమతులను అందజేశారు. పోటీల్లో కృష్ణాజిల్లా ఏఆర్ టీం ఓవరాల్ విన్నర్‌గా నిలిచింది. ఆద్యంతం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన పోటీలకు జిల్లాలోని అవనిగడ్డ, బందరు, గుడివాడ, గన్నవరం సబ్‌డివిజన్లకు చెందిన పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఏఆర్ టీం ఓవరాల్ విన్నర్‌గా ట్రోఫీ గెలుచుకోగా వాలీబాల్‌లో గుడివాడ సబ్‌డివిజన్ టీం రన్నర్‌గా నిలిచింది. కబడ్డీలో ఏఆర్ టీం విన్నర్‌గా నిలవగా అవనిగడ్డ సబ్‌డివిజన్ రన్నర్‌గా నిలిచింది. ఎస్పీ ఆర్ గంగాధరరావు, జేసీ గీతాంజలిశర్మ, కార్యక్రమంలో ఏఎస్పీ వీవీ నాయుడు, ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ టెన్నిస్ జట్టు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ టెన్నిస్ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వి.రాకేష్ వెంకటేశ్వర చౌదరి(జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమండ్రి), జి.విష్ణుసాహిత్ (జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమండ్రి), సి.హెచ్.ప్రభవ్(ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళం), సి.హెచ్.జనార్దన్‌సాగర్(సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడ), ఎం.శివకుమార్(ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చినకాకాని) జట్టులో చోటు దక్కించుకున్నారన్నారు. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు తిరువనంతపురంలోని యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

జాడలేని సంక్షేమం

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు జాస్తి

శిథిలావస్థలో భవనాలు, తలుపులు లేని మరుగుదొడ్లు, ఊడిపోయిన కిటికీలు, అరకొరగా నీటి వసతి, అపరిశుభ్ర వాతావరణంతో సమస్యల నిలయాలుగా కనిపిస్తున్నాయి కృష్ణా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు. ఇక్కడ ఇబ్బందులు ఎదురవడంతో విద్యార్థినీవిద్యార్థులకు 'వసతి' అసౌకర్యంగా మారింది. నాణ్యమైన ఆహారం అందకపోవడంతో వీటిలో ఉంటున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సంక్షేమ వసతి గృహాలను 'సాక్షి' విజిట్ చేయగా అనేక చేదు నిజాలు వెల్లడయ్యాయి.

- నాణ్యమైన భోజనం కరువు
- టాయిలెట్స్‌కు డోర్లు ఉండవు
- కళాశాల హాస్టళ్లకు బియ్యం తప్ప బిల్లులు ఇవ్వని ప్రభుత్వం



పెచ్చులూడి, రంగు వెలసిన గొడవర్రులోని బాలికల వసతిగృహం



చినగొల్లపాలెంలో 13 మంది మాత్రమే టిఫిన్ చేస్తున్నారు



శ్లాబ్ పెచ్చులూడిన అవనిగడ్డ ఎస్సీ బాలుర వసతిగృహం

సాక్షి విజిట్

సాక్షి, మచిలీపట్నం: జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు సమస్యల నిలయంగా మారాయి. సర్కారు నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ చేరిన పేద విద్యార్థులు శిథిల భవనాలు, చాలీచాలని గదుల మధ్య నివసిస్తున్నారు. అధ్వాన మరుగుదొడ్లు, అపరిశుభ్ర వాతావరణం, గదులు, కిటికీలకు డోర్లు లేక దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన ఆహారం కరువైపోవడంతో పాటు కొన్నిచోట్ల అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినీ విద్యార్థులు వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 83 సంక్షేమ హాస్టళ్లు ఉండగా 4,656 మంది వసతి పొందుతున్నారు. ఇందులో 40 సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 2485 మంది, బీసీ సంక్షేమ హాస్టళ్లలో 2171 మంది ఉన్నారు. మొత్తం హాస్టళ్లలో అబ్బాయిలు 2,262 మంది, బాలికలు 2,394 మంది ఉన్నారు.

సమస్యల నిలయాలు..

సంక్షేమ వసతి గృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. గుడివాడ మండలం మోటూరు బాలికల హాస్టల్‌లో చిన్నారులు భోజనం బాగుండటం లేదని, పురుగులు వస్తున్నాయని, ఈ విషయం చెబితే, గుంజీలు తీయించడంతో పాటు కొడుతున్నారని ఇటీవలే వీడియోలో చెప్పుకున్న ఆవేదన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌తో పాటు పలు హాస్టళ్లలో గదులు, విండోలకు డోర్లు లేవు. దీంతో విద్యార్థులు చలి, దోమలతో ఇబ్బందులు పడుతూ పడుకుంటున్నారు. మచిలీపట్నంలో హాస్టల్‌లోని టాయిలెట్స్ (మరుగుదొడ్లు, స్నానగదులు)కు డోర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లుల మంజూరులో జాప్యం

కళాశాల విద్యార్థులకు మెస్ బిల్లులు మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. జూలై నుంచి ఇప్పటి వరకు రూ.లక్షల్లో బిల్లులు ఉన్నా.. రూపాయి కేటాయించలేదు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.52 (మూడు పూటలా తిండి, స్నాక్స్ కలిపి) చెల్లించాలి. ఈ సమస్య బీసీ సంక్షేమంతో పాటు సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉందని, విద్యార్థులను పస్తులు ఉంచలేక అప్పులు చేసి విద్యార్థులకు పెడుతున్నామని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్లు) చెబుతున్నారు.

జిల్లాలో హాస్టళ్లలో పరిస్థితి ఇలా

మచిలీపట్నంలోని సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయి. సాంఘిక సంక్షేమశాఖ సమీకృత బాలుర వసతిగృహంలో పడుకునే గదులతో పాటు మరుగుదొడ్లు తలుపులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ తొలగించారు. ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో వసతులు అరకొరగానే ఉన్నాయి. బీసీ కళాశాల బాలికల వసతిగృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 88 మంది విద్యార్థినిలు ఉండగా వారు నేలమీదే పడుకుంటున్నారు. వీరికి దుప్పట్లు కూడా పంపిణీ చేయలేదు.

- అవనిగడ్డ ఎస్సీ బాలికల వసతి గృహం పాత భవనం పూర్తిగా శ్లాబు పెచ్చులూడి ప్రమాదకర స్థితికి చేరింది. విద్యార్థినులు వేరే హాలులోకి వెళ్లి నిద్ర పోతున్నారు. బీసీ బాలుర వసతి గృహం ముందు మురుగు వాసన కొడుతోంది. ఏప్రిల్ తరువాత నుంచి కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం హయాంలో దుప్పటి, బ్లాంకెట్ ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో దుప్పటి ఒక్కటే ఇచ్చి బ్లాంకెట్ ఇవ్వలేదు. నాగాయలంక బీసీ గరల్స్ హాస్టల్‌లో కొన్ని బాత్రూం డోర్లు విరిగి పోయాయి. కోడూరు ఎస్సీ హాస్టల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. కిటికీలకు డోర్లు లేవు. శ్లాబు పెచ్చులూడి కనిపిస్తోంది.
- పెడనలో బీసీ బాలికల హాస్టల్‌లో వాష్‌రూమ్స్ సక్రమంగా లేవు. వసతి గృహం శిథిలావస్థకు చేరింది. బీసీ బాలుర వసతి గృహంలో సమస్యలు వెంటాడుతున్నాయి. కళాశాల విద్యార్థుల బీసీ వసతి గృహం అద్దె భవనంలో ఉంది. వర్షం వస్తే నీరు కారుతుందని విద్యార్థులు వాపోతున్నారు. కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం బీసీ హాస్టల్‌లో రాత్రి ఎవరూ ఉండటం లేదు.
- గుడివాడ మండలం మోటూరు బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో నాసిరకం భోజనం, కంపుకొడుతున్న మరుగుదొడ్లు విద్యార్థినులకు శాపంగా మారాయి. దోమలు, ఈగలతో వారు ఇబ్బంది పడుతున్నారు.
- పెనమలూరులో ఈడుపుగల్లులోని సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థుల వసతి గృహంలో ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది. తాగునీరు తగినంత లేదు. ఆరు వాష్ రూమ్స్‌లో రెండు పంపులే పని చేస్తున్నాయి. గొడవర్రు ఎస్సీ బాలికల వసతిగృహంలో శ్లాబు కారుతోంది. ఉయ్యూరులోని ఏపీ గురుకుల వసతి గృహంలో కిటికీలకు మెష్ డోర్‌లు లేక దోమల ఎక్కువగా ఉన్నాయి.
- గన్నవరంలో సంక్షేమ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. డైట్ చార్జీలు చెల్లించడం లేదు. టాయిలెట్స్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. బాపులపాడు హాస్టల్ గదులకు తలుపులు, కిటికీలు లేవు. దీంతో దోమల బెడదతో పాటు చలికాలంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. భోజనం నాణ్యత లేదని, టాయిలెట్స్ శుభ్రంగా ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. విజయవాడ రూరల్ మండలంలోని నున్నలో ఎస్సీ బాలికల వసతి గృహంలో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి.
- పామర్రులోని బీసీ హాస్టల్‌లో సక్రమంగా సేవలు అందడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. మొవ్వ మండలంలోని బీసీ ఎస్సీ హాస్టల్లో డైట్ చార్జీలు చెల్లించడం లేదు. కాస్మెటిక్ చార్జీలు చెల్లించక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. బెడ్‌షీట్లు, కార్పెట్లను విద్యార్థులకు అందజేయలేదు. దీంతో కొందరు నేలపైన పడుకుంటుండగా, కొందరు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు.

జిల్లా వసతి గృహాల సమాచారం

వసతి గృహం	వసతి గృహాల సంఖ్య	కేటాయించిన సీట్లు	ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య
సాంఘిక సంక్షేమ బాలుర	12	1400	641
బాలికల	19	1900	1067
కళాశాల బాలుర	5	500	344
కళాశాల బాలికల	4	400	433
బీసీ సంక్షేమ బాలుర	19	1900	843
బాలికల	8	800	350
కళాశాల బాలుర	7	700	434
కళాశాల బాలికల	9	900	544
మొత్తం	83	8500	4656



బందరులో ధ్వంసమైన మరుగుదొడ్డి తలుపు

బందరులో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్‌మాల్‌లో వస్త్రాలను ప్రదర్శిస్తున్న సినీతారలు పాయల్‌రాజ్‌పుత్, నయన్‌సారిక

మచిలీపట్నంటౌన్: నగరంలో అతి పెద్ద వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీతారలు నయన్ సారిక, పాయల్ రాజ్‌పుత్ పాల్గొని సందడి చేశారు. అభిమానులకు అభివాదం చేసి, సెల్ఫీలతో ఉత్సాహపరిచారు. వీరిద్దరూ జ్యోతిప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. అమ్మకాలను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ, మచిలీపట్నం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. సీఎంఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను నాలుగు దశాబ్దాలుగా ఆంధ్ర, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని 37వ షోరూమ్‌ను మచిలీపట్నంలో ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహనబాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మహాశివుని విగ్రహం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దేదీప్యమానం..

మచిలీపట్నంటౌన్: కార్తికమాసం సందర్భంగా రాబర్ట్సన్ పేటలోని శ్రీ పర్వత వర్ధిని రాజరాజేశ్వరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు వత్తులను వెలిగించి శివనామ స్మరణ చేశారు. ఆలయ ప్రాంగణంలోని పరమేశ్వరుడి విగ్రహం ముందు కోటి దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగొంది. కార్యక్రమంలో మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, దేవదాయ శాఖ జిల్లా అధికారి సాంబశివరావు, ఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా వెలుగులో మహాశివుడు

డిసెంబర్ 15 వరకు 'బ్రూసెల్లోసిస్ టీకా'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆడ పశువుల్లో గర్భస్రావానికి, మగ పశువుల్లో కీళ్ల వాపులు, వంధ్యత్వానికి కారణమయ్యే బ్రూసెల్లోసిస్ వ్యాధి నియంత్రణకు డిసెంబర్ 15 వరకు బ్రూసెల్లోసిస్ టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా.. పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సోకే గుణం ఈ వ్యాధికి ఉందని.. పశు వ్యాధుల నియంత్రణ ద్వారా 4 నుంచి 8 నెలల వయసు ఆడ దూడలకు టీకా వేస్తారన్నారు. ఒకసారి టీకా వేస్తే జీవితంలో మరెప్పుడూ వ్యాధి రాదని పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్, సీడీవో వెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఓటర్ల జాబితా సవరణ కోసం ఈ నెల 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం-2025 పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫొటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించామన్నారు. అందులో ఏమైనా అభ్యంతరాలు, క్లయిమ్‌లు గాని చేయదలచిన వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రత్యేక శిబిరాల్లో కొత్తగా ఓటర్లు నమోదు చేసుకోవటంతో పాటు చిరునామా, ఇతర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు బూత్‌స్థాయి అధికారులను సంప్రదించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా ప్రోత్సహించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు వారి బూత్ ఏజెంట్లను కూడా ప్రత్యేక శిబిరాల్లో భాగస్వాములను చేయాలన్నారు. 2025 జనవరి 1వ తేదీన ఓటర్ల జాబితాను పరిశీలించి తాజా సమాచారంతో రూపొందించిన నివేదికను ఎన్నికల సంఘం అనుమతి కోసం పంపుతామని, అనంతరం జనవరి 6వ తేదీన ఫొటో ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఒక ఇంట్లో ఉండే కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా సిద్ధం చేస్తున్నామన్నారు. కృష్ణా, గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటివరకు 61,187 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో 50 పోలింగ్ కేంద్రాలు ఉండేవని, వీటికి అదనంగా మరో 21 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను ఈ నెల 23న ప్రకటిస్తామని, అనంతరం డిసెంబర్ 30వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. బీఎస్పీ ప్రతినిధి బాలాజీ మాట్లాడుతూ హిందూ, హైనీ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 2 వేలకు మించి ఓటర్లు ఉన్నారని, ఇతర పోలింగ్ కేంద్రాలకు మార్చాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఆర్డీవోకు సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, షారోన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనే

లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, ఇతర ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ బెంజి సర్కిల్‌లోని సంఘం హాల్లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైవీ ఈశ్వరరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత వెసులుబాటు వస్తుందని వాహన యజమానులు అందరూ ఎంతో ఆశతో ఎదురుచూస్తూ ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రగతి నుంచి వాహన్‌కు డేటా మైగ్రేషన్‌తో వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. నాలుగు నెలల నుంచి ఎన్నో సమస్యలు వస్తున్నాయన్నారు. రవాణాశాఖ, ఎన్ఐసీ అధికారులు ఎంత చేసినా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదని వివరించారు. దీంతో కొన్ని లారీలు నెలల పాటు ఆగిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వెహికల్ ఈ ప్రగతిలో స్టాపేజీ వేసి తదుపరి వెహికల్ రీ వోకేషన్ పెట్టుకుంటే నాలుగు నెలల నుంచి ఆ పని కాలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో రాసిన కేసులు విషయంలో కూడా చాలా ఇబ్బందులు ఉన్నట్లు ఈశ్వరరావు తెలిపారు. ఇలా అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం, రవాణాశాఖ మంత్రి స్పందించి పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.